వైభవంగా చండీహోమం



మావుళ్లమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): పౌర్ణమి సందర్భంగా భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో వైభవంగా చండీహోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ, వేదపండితులు హోమం జరిపించగా 87 మంది దంపతులు పాల్గొన్నారు. అలాగే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, అర్చకులు, భక్తులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



శ్రీబాలత్రిపుర సుందరీ దేవి ఆలయంలో లక్ష్మీగణపతి హోమం

శ్రీబాలత్రిపుర సుందరీ దేవి ఆలయంలో...

పౌర్ణమిని పురస్కరించుకుని భీమవరం మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరీ దేవి ఆలయ ప్రాంగణంలో లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి కుంకుమ పూజలు, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వర్క్‌షాప్‌లో అధ్యయనంతో ఎంతో ప్రయోజనం



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో భాస్కర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ఇంజనీరింగ్ విద్యార్థులు కళాశాల వర్క్‌షాప్‌లలో అధ్యయనం చేసిన అంశాలు వాస్తవ రూపంలోకి తీసుకురాగలిగితే మంచి ఫలితాలు వస్తాయని తమిళనాడులోని త్యాగరాజర్ ఇంజనీరింగ్ కళాశాల ఆర్అండ్‌డీ డీన్ ఎస్.భాస్కర్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజులపాటు నిర్వహించిన ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ అవుట్ కం బేస్డ్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ శనివారం ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వర్క్‌షాప్‌లో అధ్యాపకులు పూర్తిస్థాయిలో పాల్గొనడం వల్ల భవిష్యత్తులో కళాశాలలో మంచి ఫలితాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఐక్యూ ఏసీ డీన్ వర్క్‌షాప్ కో–ఆర్డినేటర్ ఎస్.రాజేష్ ఆధ్వర్యంలో భాస్కర్‌ను సత్కరించారు.

వెంకన్న ఆలయంలో అన్నసమారాధన



ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల సహకారంతో అఖండ అన్న సమారాధనను నిర్వహించారు. ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే కోనేటి రాయలవాడిగా ప్రసిద్ధికెక్కడంతో సుదూర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుంటున్నారు. ఈ అన్న సమారాధనలో సుమారు వెయ్యిమందికి స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయకమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


వైభవంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవాలు



సుంకరపాలెంలో ఏకాహ భజన నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని గుంపర్రు పంచాయతీ సుంకరపాలెంలో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయక, సుబ్రహ్మణ్య ప్రయుక్త శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయం వద్ద ఉన్న ధ్వజ స్థంభానికి ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు. గ్రామానికి చెందిన రిటైర్డ్ డీవైఈఓ కొంపెల్ల వెంకట సూర్య సత్యనారాయణమూర్తి సహకారంతో ఈ ఇత్తడి కవచం తొడుగుతున్నట్లు తెలిపారు. మూడు రోజుల ఉత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు ఏకాహ భజన నిర్వహించారు. ఆదివారం సాయంత్రం స్వామి వారి పల్లకీ ఊరేగింపు నిర్వహిస్తామని, రాత్రి అన్నసమారాధనతో ఉత్సవాలు ముగుస్తాయని కమిటీ సభ్యులు వివరించారు. పూజా కార్యక్రమాలన్నీ ఆలయ అర్చకులు వేదాంతం సుబ్రహ్మణ్యం బ్రహ్మత్వంలో మానేపల్లి సత్యనారాయణ (చిన్నబాబు) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: మండలంలోని ఆచంట వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యా కానుక కిట్లను ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి పంపిణీ చేశారు. శనివారం పాఠశాల ఆవరణలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల పట్ల, తల్లిదండ్రులపై గౌరవంగా ఉంటూ ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీపీ సూర్యకుమారి అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు నాగరాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

వీరవాసరం: వీరవాసరంలోని ఓ షెడ్‌లో నిర్వహిస్తున్న గాయత్రి టిఫిన్ సెంటర్‌లో శనివారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో వంట సామగ్రి కాలిపోయి రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగింది. అయితే ఈ ప్రమాదంపై టిఫిన్ సెంటర్ యజమాని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుంచి వివరాలు సేకరించారు. ఎవరో కావాలనే ఈ ఘటనకు పాల్పడ్డారని యజమాని ఆరోపించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వేగంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మొగల్తూరు పంచాయతీలోని నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మచెరువు తదితర ప్రాంతాలతో పాటు మండలంలోని కేపీ పాలెం నార్త్, సౌత పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంటబోదె పనులు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం కేపీ పాలెం సౌత్‌లో చేపట్టిన పనులను జేఈ ఆనంద్, టీఏ వెంకటేశ్వరరావు పరిశీలించి తవ్వకం పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కూలీలకు సూచించారు.

ఎస్సీ శ్మశానవాటిక ఆక్రమణపై నిరసన



వెంపలో ఎస్సీ శ్మశానవాటిక వద్ద నిరసన తెలుపుతున్న దళితులు

భీమవరం అర్బన్: వెంపలో ఎస్సీ శ్మశానవాటికను ఆక్రమించుకున్న వారిపై తగు చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో శనివారం ఎస్సీ శ్మశానవాటిక వద్ద దళితులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎస్సీ శ్మశానవాటిక ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకుని, దళితులను అవమానించిన వారిపై చర్యలు చేపట్టాలన్నారు. శ్మశానవాటికను ఆక్రమించుకుని గ్రామానికి చెందిన రైతు తన చేపల చెరువు వరకు రోడ్డు వేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్న దళితులపై దౌర్జన్యానికి దిగుతున్నారన్నారు. అంతేకాకుండా అధికారులు కూడా భూస్వామికి కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. శ్మశానవాటికను అధికారులు సర్వే చేసి కంచె వేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. ఎస్సీ శ్మశాన వాటిక ఆక్రమణను తొలగించకపోతే ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి రాజు, ఇంజేటి త్రిమూర్తులు, పట్టెం చిరంజీవి, గోగులమండ సునీల్, కడిమి ఏసురత్నం, బల్లా రంగయ్య, పాలపర్తి దానియేలు, దొండపాటి బాల, ఇంజేటి పండు, పోలుకొండ శాంతకుమారి, బొబ్బనపల్లి సువార్త, చిలకపాటి ఆనంద్, ఇంజేటి మరియమ్మ, చిలకపాటి ఆదాము, మందా చిట్టిబాబు, నేతల దేవదానం తదితరులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత



భీమవరం అర్బన్ : గూట్లపాడులో జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



పాలకోడేరు: జంతు సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న పశు సంవర్థక వైద్యాధికారిణి హేమ

భీమవరం అర్బన్: జంతు సంరక్షణ అందరి బాధ్యత అని, వాటిని పరిరక్షించాలని గూట్లపాడు మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు అన్నారు. భీమవరం మండలంలోని గూట్లపాడు, వెంప గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శనివారం జంతు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా జంతు సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి పి.పుండరీబాబు మాట్లాడుతూ జంతువులను వధిస్తే చట్ట ప్రకారం అనేక కఠిన శిక్షలు అమలులో ఉన్నాయన్నారు. వీధి కుక్కల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని వాటి జోలికి పోకూడదన్నారు. జంతువులను సంరక్షించడంతో పాటు వాటిని ప్రేమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి–2 డాక్టర్ మౌర్య సత్యేంద్ర, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జంతు సంరక్షణపై అవగాహన

పాలకోడేరు: జంతువుల హక్కుల్ని కాపాడాలని, నోరులేని మూగ జంతువుల పట్ల కర్కశంగా ఉండకూడదని పశువైద్యాధికారిణి హేమ అన్నారు. స్థానిక ప్రైవేటు స్కూల్‌లో జంతు సంరక్షణపై అవగాహనా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతువుల నుంచి లభ్యమయ్యే ఉత్పత్తులతో మానవులు ఉపయోగించే విధానాన్ని ఆమె వివరించారు. జంతు సంరక్షణా వారోత్సవాల్ని మండలంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల, పశుసంవర్థక శాఖ సిబ్బంది జయలక్ష్మి, పీ.పోతురాజు, శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వేతన సవరణపై చర్యలు తీసుకోవాలని వినతి



భీమవరం కేంద్ర సహాయమంత్రి శ్రీనివాసవర్మతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

భీమవరం: గత పన్నెండేళ్లుగా నిలిచిపోయిన వేతన సవరణ విషయంపై చర్యలు తీసుకోవాలని బీఎంఎస్, బీహెచ్ఈఎల్ కార్మిక సంఘం ప్రతినిధులు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మను కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో సంఘ నాయకులు రామస్వామి, హరీష్‌వర్మ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు బీఎంఎస్, బీహెచ్ఈఎల్ కంపెనీలకు ముడిసరుకు అందుబాటులో ఉంచడానికి ప్లాంట్స్‌ను ఎన్ఎండీసీ లేదా సెయిల్‌లో కలిపే విషయం, ఈఎంఐ లోన్స్ వడ్డీలను ఏడాది పాటు మారటోరియం విధించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై శ్రీనివాస వర్మ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషిచేస్తానన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉండి: పాతగొడవల నేపథ్యంలో గొడవ పడిన ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యండగండి శివారు రాయనివానిగూడెం ప్రాంతానికి చెందిన సాలా గణేష్, తంగెళ్ల వెంకటేశ్వరరావు అనే ఇద్దరు వ్యక్తుల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గొడవ పడి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇద్దరిపైనా ఎస్సై ఎం లక్ష్మణ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యా కిట్ల అందజేత



దిరుసుమర్రు హైస్కూల్లో విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీ చేసిన దృశ్యం

భీమవరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న కార్పొరేట్ విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ అన్నారు. దిరుసుమర్రు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యా కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గతంలో సర్కారు పాఠశాలల్లో మౌలిక వసతులు లేకపోవడమే కాక, నాణ్యమైన విద్య అందక ఎంతోమంది విద్యార్థులు చదువుకు దూరమై పొలం బాట పట్టేవారన్నారు. తల్లిదండ్రులు పిల్లలను చదివిస్తే వారే భవిష్యత్‌కు బాటలు వేసుకుంటారన్నారు. ప్రభుత్వం, దాతలు అందిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇళ్ల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కేతా నాగమణి, ఉప సర్పంచ్ అల్లూరి గంగాధర్, గవర శ్రీరాజబాబు, మైగాపుల గంగారామ్ పాల్గొన్నారు.

చిన్నారులకు విద్యాసామగ్రి అందజేత



ఉండిలో చిన్నారులకు విద్యాసామగ్రి అందిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉండి: క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుతారని లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ అన్నారు. శనివారం ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎస్వీఎస్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తల్లిదండ్రుల మాట, ఉపాధ్యాయులు బోధించే పాఠాలు శ్రద్ధగా వింటే జీవితంలో గొప్పవారవుతారని అన్నారు. దాతలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుని మరింత బాగా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎస్.శేషయ్య, క్లబ్ అడ్మినిస్ట్రేటర్ రుద్రరాజు నరసరాజు, ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, పాలతీర్థపు నర్సింగరావు, బొండాడ కేశవరావు, గొట్టుముక్కల రాము, నంబూరి కాశీవిశ్వేశ్వరరావు, ఉపాధ్యాయులు శివరామరాజు, ఫ్లారెన్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట్రామరాజు ఆదేశాల మేరకు పట్టణంలోని లయన్స్ కంటి ఆసుపత్రిలో ఏడుగురికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించినట్లు ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహారావు చేతుల మీదుగా రోగులకు కళ్ల జోళ్లు ఉచితంగా అందజేశామన్నారు.

వీరవాసరంలో సామూహిక అక్షరాభ్యాసం



విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేస్తున్న గ్రామ పెద్దలు

వీరవాసరం: వీరవాసరం కవురువారి వీధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం 1వ తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. మారెళ్ల జయలక్ష్మి, ఆనందం బాలాజీ, దేవిరెడ్డి పుల్లారావు, సూర్య వెంకటేశ్వరరావు ఆర్థిక సహకారంతో 1, 2 తరగతి విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. అలాగే ప్రభుత్వం అందజేసిన ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. గ్రామ సర్పంచ్ గెడ్డం భారతి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు అడ్డాల శ్రీరామచంద్రమూర్తి (రాము), ఎంపీటీసీ కడలి నెహ్రూ, వార్డు సభ్యుడు మొఖమట్ల దుర్గాప్రసాద్, కవురు శ్రీనివాస్, కాంప్లెక్స్ చైర్మన్ కె శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం దేవిరెడ్డి పుల్లారావు, పీఎంసీ చైర్మన్ సీహెచ్ కనకపరమేశ్వరి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

24న రాతపరీక్ష

పెనుగొండ: ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని పెనుగొండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మిగులు సీట్ల కోసం ఈ నెల 24న రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.ఎస్తేర్ క్వీనీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 సంవత్సరానికి గానూ పాఠశాలలో ఆరో తరగతికి 41 సీట్లు, 7వ తరగతికి మూడు సీట్లు, 8వ తరగతికి మూడు సీట్లు, 9వ తరగతికి ఐదు సీట్లు మిగిలి ఉన్నాయని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఈ నెల 24వ తేదీ ఉదయం 11 గంటలకు పాఠశాలలో జరిగే పరీక్షకు హాజరు కావాలని కోరారు. మిగిలిన వివరాలకు 95504 02822కు ఫోన్ చేయాలని సూచించారు.

రైతులు ఆకుమడులు వేసుకోవాలి



దుక్కి దున్నేందుకు సిద్ధం చేసిన చేను

మొగల్తూరు: రైతులు ఆకుమడులు వేసుకునేందుకు సిద్ధం కావాలని, ముందుగా విత్తన శుద్ధి చేయాలని వ్యవసాయాధికారి అబ్దుల్‌రహీమ్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పొడి విత్తనాలకు అయితే 1 కేజీ విత్తనాలకు 3 గ్రాముల కార్బెండిజంను, తడి విత్తనాలకు అయితే 4 గ్రాముల కార్బెండిజంను కలిపి విత్తన శుద్ధి చేయాలని పేర్కొన్నారు. మండంలోని 17 గ్రామాలకు సంబంధించి 980 ఎకరాల్లో సార్వా సాగు చేపడతారని అంచనా వేస్తున్నామని వివరించారు. రైతులు ఎంటీయూ స్వర్ణ 7029, 1061ఇంద్ర, 1064 అమర, 1262 మార్టేరు మసూరి, ఎంటీయూ 1318 శీతాకాలం సన్నాలు వినియోగించాలని సూచించారు. లోతట్టు పంటచేలకు 1100 బాడవ మసూరి, ఎంటీయూ 1140 బీమా, ఎంటీయూ 1064 అమర,ఎంటీయూ 1172,ఎంటీయూ 1318 వంటివి అనుకూలంగా ఉంటాయని పేర్కొన్నారు.

ప్రైవేట్ పాఠశాల తనిఖీ

ఉండి: ఎస్ఎఫ్ఐ ఉండి శాఖ ఫిర్యాదు మేరకు ఉండిలోని గీతాంజలి ప్రైవేటు స్కూల్‌ను తనిఖీ చేసినట్లు ఎంఈవో బి.జ్యోతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరిశీలనలో స్కూల్‌లో ఐఐటీ పుస్తకాలు, బ్యాగులు తదితరమైనవి పరిశీలించామని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సామగ్రిని స్కూల్‌లోనే ఒక గదిలో ఉంచి గదికి సీల్ వేశామన్నారు. తనిఖీకి సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు ఆమె తెలిపారు.

ఉన్నత ప్రమాణాలతో బోధించాలి



చినకాపవరంలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఆకివీడు: విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యాబోధన అందజేయాలని జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకట్రాజు (యండగండి శ్రీను) అన్నారు. మండలంలోని చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థి కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చినకాపవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు గతంలో మంచి పేరు ఉందన్నారు. విద్యార్థులు మండల స్థాయిలో ప్రథమ స్థానం నిలిచిన సంఘటనలు ఉన్నాయన్నారు. క్రీడల్లో కూడా ముందజలో ఉన్నారని చెప్పారు. అదేరీతిలో విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు అల్లాడి బాలాజీ, మద్రివాడ వెంకట్రావు, శ్రీనివాసరావు, చెన్నంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవకులకు హరివిల్లు సత్కారం



బుద్దాల రామారావును సన్మానిస్తున్న హరివిల్లు సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సామాజికంగా సేవా కార్యక్రమాలు చేయడం కూడా ఒక అదృష్టంగానే భావించాలని ఆ అవకాశం అందరికీ రాదని హరివిల్లు అధ్యక్షుడు వంగా నరసింహరావు అన్నారు. శుక్రవారం రాత్రి హరివిల్లు ఆధ్వర్యంలో సామాజిక సేవలకు సత్కారం కార్యక్రమంలో భాగంగా తాడేపల్లిగూడెం బీవీఆర్ కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు, కైండ్‌నెస్ సంస్థ చైర్మన్ గట్టిం మాణిక్యాల రావులను సన్మానించారు. వంగా నరసింహరావు మాట్లాడుతూ బీవీఆర్ కళాకేంద్రం స్థాపించి ఎంతో కళాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్న రామారావు, కైండ్‌నెస్ సంస్థ చైర్మన్‌గా అనివార్య కారణాలతో మృతి చెందిన వారిని స్వదేశానికి తీసుకురావడానికి కృషి చేస్తున్న మాణిక్యాలరావులను సన్మానించడం అభినందనీయమన్నారు. హరివిల్లు సభ్యులు యర్రంశెట్టి వెంకటరత్నం, గోపాలకృష్ణ, గుండా రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.